చర్యలు తీసుకోవాల్సి ఉంది



డాక్టర్లు భయంతో పనిచేసే పరిస్థితి ఉండకూడదు. వైద్యులు, సిబ్బందిపై దాడి చేయాలంటేనే భయం కలగాలి. కఠినమైన చట్టాలతోనే ఇది సాధ్యమవుతుంది. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పటిష్ట చట్టాల అమలుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– నవీన్‌కుమార్‌రెడ్డి, చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యుడు

రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..



డాక్టర్లు, సిబ్బంది విధులు నిర్వహించే క్రమంలో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకున్నా వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఆ విధంగా ఉన్నప్పుడే పూర్తిస్థాయిలో పనిచేసేందుకు వీలవుతుంది. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన బాధాకరం. కిరాతకంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ కె.శేషారత్నం, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆత్మకూరు

దాడులు చేయడం బాధాకరం



వైద్యులు ఎంతో కష్టపడి పనిచేస్తారు. రోగులను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయాలని కృషి చేస్తుంటారు. అలాంటి వారి సేవలను గుర్తించకుండానే పలువురు దాడులు చేయడం బాధాకరం. ఇటీవల జరిగిన సంఘటనలతో విధులు నిర్వహించాలంటేనే డాక్టర్లు భయపడుతున్నారు. ముఖ్యంగా మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి.

– డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఆత్మకూరు

ఇంటి నుంచే చదువు

చాలామందికి చదువుకోవాలనే ఆశ ఉంటుంది. కానీ కుటుంబ పరిస్థితులు, పేదరికం కారణంగా అది సాధ్యం కాదు. బడి మానేసిన యువత, వయోజనులకు చదువుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానం తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సులను ప్రతి సంవత్సరం నిర్వహిస్తోంది. కాగా 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు కొద్దిరోజుల క్రితం నోటిఫికేషన్ జారీ అయింది.

- ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు వేళాయె..
- టెన్త్, ఇంటర్ పూర్తి చేసే సువర్ణావకాశం
- సాధారణ కోర్సులతో సమానంగా గుర్తింపు
- విడుదలైన నోటిఫికేషన్

సీతారామపురం: జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 95 ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని స్టడీ సెంటర్ల ద్వారా ప్రవేశం పొందిన వారంతా చదువుకోవచ్చు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించే గడువు ఈనెల 27వ తేదీతో ముగిసింది. ప్రవేశం తీసుకోవడానికి ఎలాంటి వయోపరిమితి లేదు.



ఓపెన్ స్కూల్ ప్రవేశాల బ్రోచర్ విడుదల చేస్తున్న అధికారులు (ఫైల్)

వారితో సమానంగా:

ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించిన వారికి ఇచ్చే సర్టిఫికెట్లు రెగ్యులర్ విద్యార్థులకిచ్చే సర్టిఫికెట్లతో సమానంగా ఉంటాయి. ఎస్ఎస్‌సీకి సంబంధించి ఐదేళ్లలో గరిష్టంగా 9 సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణత అవ్వాలి. ఇంటర్ అయితే పది పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. ఈ వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక సబ్జెక్ట్ రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో 9 సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణత కాకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

అర్హతలిలా..

ఎస్ఎస్‌సీలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 ఏళ్ల వయస్సు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు. చదవడం, రాయడం తెలిసి ఉంటే చాలు. దరఖాస్తుతోపాటు టీసీ, రికార్డు షీట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌లో చేరేందుకు పది మార్కుల జాబితా, టీసీని దరఖాస్తుతోపాటు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రం జత చేయాలి.

ఫీజుల వివరాలు

ఎస్ఎస్‌సీకి సంబంధించి పురుషులకు (జనరల్) రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,550, అన్ని వర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులకు రూ.1,150, ఇంటర్‌కు సంబంధించి పురుషులకు (జనరల్) రూ.1,800, అన్ని వర్గాల మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు రూ.1,500లుగా నిర్ణయించారు.

వారికి అవకాశం

రెగ్యులర్‌గా పాఠశాలలు, కళాశాలల్లో పది, ఇంటర్ చదివి ఉత్తీర్ణత సాధించలేకపోయిన వారు కూడా ఓపెన్ స్కూల్‌లో చేరి సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పాసయ్యే అవకాశముంది. రెగ్యులర్‌గా చదివి ఫెయిలైన నాటి నుంచి ఐదేళ్లలోపు ఓపెన్ స్కూల్లో చేరితే రెగ్యులర్‌గా పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులు బదలాయించుకునే అవకాశముంది. ఎస్ఎస్‌సీలో హిందీకి మాత్రం ఈ అవకాశం లేదు.

- జిల్లాలో స్టడీ సెంటర్లు : 95
- అపరాధరుసుము లేకుండా ఫీజు చెల్లించే గడువు 27వ తేదీతో ముగిసింది.
- రూ.200 అపరాధరుసుముతో వచ్చే నెల 4వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని అధికారులు తెలిపారు.

సబ్జెక్టులు ఏంటంటే?

ఎస్ఎస్‌సీ గ్రూప్–ఏలో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా భాషలు తీసుకోవచ్చు. గ్రూప్–బీలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి. ఇంటర్ గ్రూప్–ఏలో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, తమిళం, హిందీ, ఒరియా తీసుకోవచ్చు. గ్రూప్–బీలో ప్రధాన సబ్జెక్ట్‌లో మూడింటితోపాటు ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకోవచ్చు. ప్రవేశం పొందిన తర్వాత స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు. ఓపెన్ స్కూల్లో ప్రవేశం పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా స్టడీ సెంటర్లలో 30 కాంటాక్ట్ తరగతులు నిర్వహిస్తారు. వీటిల్లో 24 క్లాస్‌లకు హాజరైన వారికి మాత్రమే మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే పరీక్షలకు అనుమతి ఇస్తారు.

గుర్తింపు ఉంటుంది



ఈ ఏడాది ఓపెన్ పది, ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంటర్నెట్ సెంటర్లలో ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి జారీచేసే సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంటుంది. నిర్దేశించిన గడువులోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలి.

– రామారావు, డీఈఓ

అడ్మిషన్ల పెంపునకు కృషి



చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వరం. ఈ ఏడాది పది తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి. అడ్మిషన్ల పెంపునకు అన్ని శాఖల సమన్వయంతో కృషి చేస్తున్నాం.

– అసదుల్లాఖాన్, జిల్లా కో–ఆర్డినేటర్

క్లుప్తంగా

పంచాయతీలో అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మేజర్ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరిగాయని పూర్తిస్థాయిలో విచారణ చేసి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని వింజమూరు ఎంపీటీసీ సభ్యురాలు భవానీ కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాధారణ నిధులు, 15 ఫైనాన్స్ నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపించారు. విధి దీపాల కొనుగోలు, మోటార్ల రిపేర్లు, పారిశుద్ధ్య పనుల్లో నిధుల గోల్‌మాల్ చేసినట్లు ఎంపీటీసీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సిమెంట్ వర్క్స్ విషయంలో ఎం–బుక్‌లు లేకుండానే నకిలీ బిల్లులు పెట్టి నిధులు డ్రా చేశారని ఆరోపించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డిని అడగ్గా విచారణ జరుగుతున్నట్లు మంగళవారం వెల్లడించారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

ఆత్మకూరు: పట్టణంలోని దర్గా సెంటర్‌లో ఉన్న ఓ ఆటోమొబైల్ దుకాణంలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. మూసి ఉన్న దుకాణంలో నుంచి పొగలు వస్తుండగా గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి, దుకాణ యజమానికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైరింజిన్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.25 వేల విలువైన వస్తువులు కాలిపోయాయని దుకాణదారుడు వాపోయాడు.

బస్సులు నడపాలని వినతి

ఉదయగిరి: ఉదయగిరి, ఆత్మకూరు, కావలి మార్గాల్లో రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, దీనిపై దృష్టి సారించాలని ఇన్నోవేటివ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన ఎల్.రాజేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం కావలి డిపో ఇన్‌చార్జ్ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందించి బస్సులు నడపాలని కోరారు. రాత్రి 10 గంటలకు కావలి నుంచి వింజమూరు, ఉదయగిరి వైపు ఒక బస్సు నడపాలని కోరారు. అనంతరం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వరికుంటపాడు: మండలంలోని వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లె పశు వైద్యశాల పరిధిలోని పాడిరైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ సూచించారు. పెద్దిరెడ్డిపల్లిలో సిబ్బంది నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 19 వేల పశువులకు టీకాలు వేయాల్సి ఉందన్నారు. ఈనెల 20 నుంచి ఇప్పటి వరకు 8 వేల పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేస్తామన్నారు.

బీజేపీ నేతల సమావేశం

చేజర్ల: స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. సభ్యత్వ నమోదు చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నేతలు చర్చించారు. సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి భరత్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, మండలాధ్యక్షుడు గూండాల విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో గొడవలు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలోని కోదండరామాలయం సమీపంలో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. ఆలయ సమీపంలోని ఖాళీ రైల్వే క్వార్టర్స్, పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తూ, మద్యం తాగుతూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తుండడంతో స్థానికులు హడలిపోతున్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ ద్విచక్ర వాహనాలపై ఖాళీ రైల్వే క్వార్టర్స్ వద్దకు చేరుకుంటున్న ఆకతాయిలు గంజాయి మత్తులో గొడవలకు దిగుతుండడం, సమీపంలోని రైల్వే ఉద్యోగులతో వివాదాలు పెట్టుకుంటున్నారు. నాలుగైదు కుటుంబాలు ఇళ్లు ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయాయంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. పోలీసులు స్పందించాల్సిన అవసరముంది.

నేటి నుంచి పొగాకు బ్యారెన్లకు రిజిస్ట్రేషన్లు

మర్రిపాడు: 2024–25 సంవత్సరానికి పొగాకు బ్యారెన్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 24వ తేదీ వరకు సాధారణ ఫీజుతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. 25 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు రూ.100 అపరాధరుసుముతో, నవంబర్ 9 నుంచి 20వ తేదీ వరకు రూ.400 అపరాధరుసుముతో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని వెల్లడించారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్, పట్టాదారు పాసుపుస్తకం జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు తీసుకురావాలన్నారు.

కఠిన చట్టాల అమలుకు డిమాండ్



ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

వింజమూరు(ఉదయగిరి): మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలని మహిళా ఉద్యమ నాయకురాలు వై.బిందుశ్రీ డిమాండ్ చేశారు. వింజమూరులో మంగళవారం స్థానిక మహిళలు శివాలయం నుంచి బంగ్లా సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వరకు 'సేవ్ ఉమెన్ – సేవ్ లైఫ్స్' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కతాలో యువ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను మమత ప్రభుత్వం రక్షించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్రంలోనూ ఇటీవల మహిళలపై లైంగికదాడులు, హత్యలు పెరగడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీలో గ్రామ పెద్దలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన పెంచాలి

ఆత్మకూరు: నేత్రదానంపై అందరూ అవగాహన పెంచాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శర్వాణి అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సూపరింటెండెంట్ డాక్టర్ కె.శేషారత్నం, ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి పాల్గొన్నారు. శర్వాణి మాట్లాడుతూ ప్రతి ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఒకరు నేత్రదానం చేస్తే ఇద్దరికి మాత్రమే ఆ కార్నియా ఉపయోగించేవారని, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో నలుగురికి ఉపయోగించి కంటి చూపు కల్పిస్తున్నట్లు వివరించారు. మరణించిన ఆరు గంటల్లోపే కళ్లను సేకరించేందుకు వీలవుతుందన్నారు. నేత్రదానం చేస్తానని డిక్లరేషన్ ఇచ్చిన వారు మృతిచెందితే కుటుంబసభ్యులు ఆ విషయాన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు దత్త ప్రసాద్, నరసింహ శాస్త్రి, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శర్వాణి

గ్రామాల్లో వైద్యసేవలు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి ఎస్టీ కాలనీ, టీకేపాడు ఆరోగ్య ఉపకేంద్రంలో 104 ద్వారా మంగళవారం రోగులకు వైద్య సేవలందించారు. టీకేపాడులో ఆరుగురు గర్భిణులు, నలుగురు బాలింతలను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చిత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్ నవీన్, చేజర్ల పీహెచ్‌సీ డాక్టర్ మెహతాబ్, ఏఎన్ఎం ఈ.మస్తానమ్మ, ఇంకా పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

- **వరికుంటపాడు:** మండలంలోని డక్కునూరు గ్రామంలో 104 వాహనం ద్వారా మంగళవారం వైద్యాధికారిణి ఆయేషా వైద్యసేవలందించారు. 27 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

సీతారామపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలను తీయాలని ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మండల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారంతా మంగళవారం ఎమ్మార్సీలో ఎంఈఓ మస్తాన్‌వలీకి వినతి పత్రం అందజేశారు. ఒకరు నామోషీగా భావించిన పనిని తమకు అప్పగించడం సరికాదన్నారు. ఇది సచివాలయ ఉద్యోగులను కించపరిచే విధంగా ఉందన్నారు. ఉత్తర్వులను వెనక్కి తీసుకోకుంటే ఆందోళన చేస్తామన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

చర్యలు తీసుకుంటాం : ఎస్సై

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం.ఉమాశంకర్ తెలిపారు. కలిగిరిలో మంగళవారం వాహనచోదకులు, వ్యాపారస్తులకు పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారులు రోడ్లపైన దుకాణాల సామగ్రిని ఉంచరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

గ్రామస్తులతో సీఐ సమావేశం

మర్రిపాడు: మండలంలోని బ్రహ్మణపల్లి వాసులతో ఆత్మకూరు సీఐ గంగాధర్ మంగళవారం సమావేశమయ్యారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అక్రమంగా ఇసుక రవాణా చేసినా, గొడవలు చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు..

దువ్వూరులో ఉత్సవాలు



అభయాంజనేయస్వామి విగ్రహ ఊరేగింపు

సంగం: మండలంలోని దువ్వూరు గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా కుంభాభిషేక మహోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు.

నూతన చట్టాలపై అవగాహన

సీతారామపురం: నూతన చట్టాలపై విద్యార్థినులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సీతారామపురం ఎస్సై అనూష అన్నారు. ఆమె మంగళవారం స్థానిక ఎల్‌వీఆర్ కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడారు. ప్రజలకు మరింత సేవలందించడం, బాధితులకు న్యాయం చేయడమే నూతన చట్టాల ఉద్దేశమన్నారు. డయల్ 100, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఈవ్‌టీజింగ్ నిర్మూలన, మహిళా వేధింపులు, హత్యాచార నిరోధక చట్టాలు, శిక్షలు, తదితర వాటి గురించి వివరించారు.

రేపటి నుంచి వేళాంగణి మాత మహోత్సవాలు

సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామపురం గ్రామ ఎస్సీ కాలనీలోని నిత్యసహాయ మాత ఆలయంలో ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు వేళాంగణి మాత మహోత్సవాలు నిర్వహించనున్నట్లు మందా సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు జెండా ఆవిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. రోజూ సాయంత్రం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 8వ తేదీ ఉదయం దివ్యబలి పూజతోపాటు మహోత్సవం, సాయంత్రం వేళాంగిణి మాత తేరు ప్రదక్షిణ జరుగుతుందన్నారు. మండలంలోని క్రైస్తవులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మార్సీలో శిక్షణ

సీతారామపురం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్యా విధానంపై మంగళవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్‌వలీ మాట్లాడుతూ దూరవిద్యా విధానం సువర్ణ అవకాశమన్నారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవి, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎంపీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, విద్యాసంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

అనుమసముద్రంపేట: మండలంలోని ఉర్దూ పాఠశాలలను జిల్లా ఉర్దూ డీఐ షేక్ ఖాజామొహిద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత హసనాపురంలోని ఉర్దూ ఎంపీపీ స్కూల్‌ను చూశారు. ఎన్‌రోల్‌మెంట్ చాలా తక్కువగా ఉందని, పెంచాలని టీచర్లకు సూచించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏఎస్‌పేటలోని ఉర్దూ ఎంపీయూపీ పాఠశాలను సందర్శించారు. ఇక్కడ టీచర్ అవసరం ఉందని తెలిపారు.

అక్రమ నిర్మాణాలను ఆపాలంటూ..

- ఎంపీడీఓకు గ్రామస్తుల వినతి

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని కిస్టీపురం ఎంపీపీ స్కూల్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని, వెంటనే ఆపించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ రాజేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో ఈ స్థలంలో మంచినీటి బోరు వేయించిందన్నారు. దానిని ప్రారంభించిన శిలాఫలకం అక్కడే ఉందని, వాటిని ధ్వంసం చేసి ఆ ప్రదేశాన్ని చదును చేసి అక్రమంగా కట్టడాలు చేపట్టారన్నారు. పంచాయతీ పాలకులు, కార్యదర్శి పట్టించుకోలేదని ఆ వినతిపత్రంలో కోరారు. ఎంతో విలువైన ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ ఆదేశాలతో బుక్కాపురం, కిస్టీపురం పంచాయతీ కార్యదర్శులు ఆ ప్రాంతాన్ని పరిశీలించినా కట్టడాన్ని ఆపలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం వెనుక అధికార పార్టీకి చెందిన సర్పంచ్ ప్రమేయం ఉండడంతో అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



దుత్తలూరు సెంటర్‌లో..



జలదంకిలో కల్యాణోత్సవం

జలదంకి: మండలంలో మంగళవారం కూడా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. జలదంకిలోని శ్రీకృష్ణుని మందిరంలో రుక్మిణి, సత్యభామా సమేత శ్రీకృష్ణునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు.

- **సీతారామపురం:** మండల కేంద్రంలోని కురవవీధి యాదవ సంఘం యూత్ ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు జరిగాయి. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులను సన్మానించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఆదోని వెంకటసుబ్బయ్య, పుటాల అంకయ్య, ఆరెళ్ల దస్తగిరి, ఆదోని ఏడుకొండలు, కాశీ, బండి రవి, నాగార్జున, సురేష్ పాల్గొన్నారు.
- **దుత్తలూరు:** త్రైత సిద్ధాంతాన్ని ఆచరించే వారు మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకల్ని చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 30వ తేదీన మధ్యాహ్నం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల వ్రాత పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



సీతారామపురంలో గ్రామోత్సవం

- **చేజర్ల:** మండలంలోని ఆదూరుపల్లిలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మందిరంలో పూజలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి పాల్గొన్నారు.
- **ఆత్మకూరు:** కృష్ణాష్టమి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. రాత్రి గ్రామోత్సవం జరిగింది. మహిళల కోలాటం ఆకట్టుకుంది.

కాలేజీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కాలేజీకి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మూడురోజులపాటు జరిగే క్షేత్ర పర్యటనకు మంగళవారం బయలుదేరారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ పాల్ మాట్లాడుతూ 80 మంది విద్యార్థులు, ముగ్గురు అధ్యాపకులు, సిబ్బంది కలిసి కడప, తిరుపతి, నెల్లూరు, కావలిల్లో వివిధ కృషి విజ్ఞాన కేంద్రాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రగతి యువ కేంద్రాలు, పరిశోధన కేంద్రాలు, ఉద్యానవన కాలేజీలు సందర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కాలేజీ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. నారాయణస్వామి, కిషన్‌తేజ, అశోక్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



క్షేత్ర పర్యటనకు వెళ్లిన బృందం

గుంత తవ్వారు.. పూడ్చడం మరిచారు

ఆత్మకూరు: ఆత్మకూరు నుంచి నెల్లూరుపాళెం, పేరారెడ్డిపల్లి బీసీ కాలనీలకు తాగునీటి సరఫరా చేసే పైపులైన్ సెయింట్‌మేరీస్ పాఠశాల సమీపంలో దెబ్బతినడంతో మున్సిపల్ సిబ్బంది అక్కడ గుంత తవ్వి మరమ్మతులు చేశారు. ఇది జరిగి సుమారు 20 రోజులైంది. ఇంతవరకు గుంతను పూడ్చకపోవడంతో బృందావనం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



తవ్వి వదిలేసిన గుంత